క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకిసేవ గావించారు.

సుదర్శనస్వామికి అభిషేకం



విశేషాలంకరణలో సుదర్శనస్వామి

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సుదర్శనస్వామికి పెరుమాలిక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పాల్గొన్న భక్తులు దోషాల నుంచి విముక్తి పొందుతారని అర్చకులు వెల్లడించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన వేదాయపాళెం రైల్వేస్టేషన్లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై మంగళవారం చోటుచేసుకుంది. మృతుడు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి.. నలుపు రంగుపై గ్రే రంగు డిజైన్ లుంగీని ధరించి ఉన్నారు. ఘటనపై రైల్వే పోలీసులకు స్టేషన్ సిబ్బంది సమాచారం అందించారు. ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

28న జూనియర్ కళాశాలల బంద్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బంద్‌ను ఈ నెల 28న నిర్వహించనున్నామని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఐఓ కార్యాలయ ఎదుట ఆవిష్కరించారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణ్

అల్లూరు: అల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఎం.హరి నారాయణ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో మొదలైన నాడు–నేడు రెండో విడత పనులు వర్షాల కారణంగా కాస్త జాప్యం జరిగిందని, త్వరతగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని గైనకాలజీ, సర్జికల్, వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట కావలి ఆర్డీఓ శీనానాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ కట్టా వెంకటేశ్వర్లు, కమిషనర్ ఫణికుమార్, పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

- డీపీఓ సుస్మితారెడ్డి
- అర్హులకు ధ్రువీకరణ పత్రాల అందజేత



బుచ్చిరెడ్డిపాళెం : మాట్లాడుతున్న డీపీఓ సుస్మితారెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న సురక్షతో గ్రామస్థాయిలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు డీపీఓ సుస్మితారెడ్డి అన్నారు. మండలంలోని రేబాలలో ఉన్న సాయిబాబా కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని, అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తిస్తున్నారని, అందులో భాగంగా వారికి అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ డీపీఓ సౌజన్య భారతి, తహసీల్దార్ సుధీర్, ఎంపీడీఓ పెంచలశ్యామ్, ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు యర్రంరెడ్డి నాగసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.

పేదలకు లబ్ధి

పొదలకూరు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని డీఎల్‌డీఓ వసుమతి పేర్కొన్నారు. మండలంలోని మరుపూరు, విరువూరు సచివాలయాల్లో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపుల్లో డీఎల్‌డీఓతో పాటు తహసీల్దార్ కె.వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్‌కుమారి పాల్గొని, అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వసుమతి మాట్లాడుతూ వలంటీర్లు ముందుగా ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేసి సర్టిఫికెట్ల వివరాలను తెలుసుకుంటారన్నారు. అనంతరం ప్రత్యేక శిబిరాల్లో ప్రజా ప్రతినిధులతో కలిసి సర్టిఫికెట్లను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎస్.నాగయ్య, జగన్‌మోహన్, మాజీ సర్పంచులు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వక్లూరు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి కిశోర్‌కుమార్, భాగ్యలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

మనుబోలు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని సర్పంచ్ మన్నెమాల సమతమ్మ, మండల ఉపాధ్యక్షురాలు గుండాల చందన అన్నారు. మండలంలోని గురివిందపూడి, కట్టువపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరాలను మంగళవారం నిర్వహించి అర్జీదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవసరమైన ధ్రువీకరణ పత్రాలు లేక సంక్షేమ పథకాలకు దూరమైన వారికి సురక్ష ద్వారా న్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సర్పంచ్ వెంకటరమణయ్య, ఎంపీటీసీ గుండాల శిరీష, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు మన్నెమాల సుధీర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, గుండాల ఆదినారాయణ, చేవూరు ఓసూరయ్య తదితరులు పాల్గొన్నారు.

అనేక ప్రయోజనాలు

ముత్తుకూరు : జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల పేద ప్రజలకు అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయని ఎంపీపీ గండవరం సుగుణ అన్నారు. ముత్తుకూరు–3 సచివాలయంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎంపీడీఓ ప్రత్యూష మాట్లాడుతూ, ఈ కార్యక్రమం వల్ల అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇంటి ముంగిట చేరుస్తున్నామన్నారు. ఈ సచివాలయం పరిధిలో మొత్తం 1,416 ఇళ్లు ఉన్నాయి. ఈ మేరకు 27 మంది వలంటీర్లు 1,220 ఇళ్లను సర్వే చేసి, 675 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సర్పంచ్ బూదూరు లక్ష్మి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారమే లక్ష్యం

తోటపల్లిగూడూరు : చిన్న చిన్న సాంకేతిక కారణాలతో పథకాలు అందని వారిని గుర్తించి సమస్యలను పరిష్కరించడమే జగనన్న సురక్ష లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి కోడూరు దిలీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోడూరు బిట్–1 సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ క్రమంలో సచివాలయ పరిధిలో 600 మందికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. అనంతరం దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, తహసీల్దార్ హమీద్, ఎంపీడీఓ హేమలత, వైఎస్సార్‌సీపీ నేతలు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా..

ఇందుకూరుపేట: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఇందుకూరుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని, ధ్రువీకరణ పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, పార్టీ నేత కైలాసం శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ప్రజల పాలిట కల్పతరువు

కొడవలూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజల పాలిట కల్పతరువు అని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని మిక్కిలింపేటలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొని, సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురక్ష కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో 90 శాతానికి పైగా కుటుంబాలు వినియోగించుకోవడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వి.నాగరాజు, సర్పంచ్‌లు మారంరెడ్డి రంగారెడ్డి, వల్లాపురం నవీన్, వైఎస్సార్‌సీపీ నేత జుటూరు వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ముంగిటకే సర్టిఫికెట్లు

కోవూరు : ఇంటి వద్దే వివిధ రకాల సర్టిఫికెట్లను అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం తోడ్పడుతోందని డీసీఎంఎస్ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి అన్నారు. కోవూరు సచివాలయం–4లో జగనన్న సురక్ష శిబిరం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరికీ అందించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఏఏబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, పలు విభాగాల అధ్యక్షులు సుధాకర్, చిరంజీవి, పార్టీ నేతలు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, సుప్రజ, సుశీల, కమలాకర్, ఉప సర్పంచ్ మైనుద్దీన్ పాల్గొన్నారు.



పొదలకూరు : మరుపూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మనుబోలు : ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేతలు



ఇందుకూరుపేట: కొత్తూరులో..



కోవూరు సచివాలయం–4లో..



కొడవలూరు: మిక్కిలింపేటలో..



ముత్తుకూరు : ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ సుగుణ



తోటపల్లిగూడూరు : కోడూరు బిట్–1 సచివాలయంలో..

ప్రమాణాల మెరుగునకు డిజిటల్ బోధన

- ఎంఈఓ–2 వెంకటరత్నం



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ–2 వెంకటరత్నం

బుచ్చిరెడ్డిపాళెం : విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధనను ప్రవేశపెట్టిందని ఎంఈఓ–2 వెంకటరత్నం తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో డిజిటల్ విద్యాబోధనపై ఉపాధ్యాయులకు మంగళవారం ఒకరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైజూస్ అసిస్మెంట్, టోఫెల్, స్మార్ట్‌టీవీ, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ వంటి వాటితో విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో సెమిస్టర్–2 పాఠ్యా పుస్తకాలను అందజేశామని తెలిపారు. విద్యార్థులు ఒక్కరోజు పాఠశాలకు రాకపోయినా వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం సేకరించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసన్, రిసోర్స్‌పర్సన్ సుధీర్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, సీఆర్పీలు మహేష్, మల్లేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగుపై నైపుణ్యంతో విలువల పెంపు

- ఎంఈఓ వసంతకుమారి



మాట్లాడుతున్న ఎంఈఓ వసంతకుమారి

కొడవలూరు: విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే తెలుగు భాషలో నైపుణ్యం సాధించడం ద్వారా నైతిక విలువలు పెంపొందుతారని ఎంఈఓ జి.వసంత కుమారి తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెం, గండవరం, కొడవలూరులో జరిగిన స్కూలు కాంప్లెక్స్ సమావేశాలకు మంగళవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కొడవలూరులో ఆమె మాట్లాడుతూ తెలుగు భాషపై విద్యార్థులు పట్టు సాధిస్తే ఇతర భాషలను సులభంగా నేర్చుకోవచ్చని తెలిపారు. అందువల్లే ప్రభుత్వం ప్రాథమిక స్థాయిలోని విద్యార్థుల తెలుగు భాష బోధనకు ఇద్దరు ఉపాధ్యాయుల వంతున నియమిస్తున్నట్లు చెప్పారు. పాఠ్యపుస్తకాల్లో సైతం ప్రతి భాషకు తెలుగు అనువాదం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రుణ పరిమితిని పెంచుకోవాలి

- ఏపీఎం రుక్మిణి



మాట్లాడుతున్న ఏపీఎం రుక్మిణి

కొడవలూరు: పొదుపు సభ్యులు తమ రుణ పరిమితిని పెంచుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సంఘ బంధం వీఓఏలు, సంఘమిత్ర కార్యవర్గ సభ్యులకు ఆర్థిక కార్యకలాపాల నిర్వహణపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సభ్యత్వం అనివార్య కారణాల వల్ల రద్దయినా లేక రద్దు చేసుకున్నా వారు చెల్లించిన పొదుపు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని చెప్పారు. రద్దయినప్పుడు చెల్లించే మొత్తానికి ఎలాంటి వడ్డీ ఉండదన్నారు. ఎంత మొత్తం కట్టి ఉంటే అంతే చెల్లిస్తామన్నారు. పొదుపును పెంచుకుంటే ఒక్కో సభ్యురాలు రూ.1.50 లక్షల రుణం పొందే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ప్రతి సభ్యురాలు రూ.1.50 లక్షల రుణం పొందేందుకు అర్హత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ మిత్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరమ్మ, సుశీల, సీసీలు కె.ఉదయ్‌కుమార్, మమత, శ్రీదేవి, శోభ, సుకన్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉత్తమ విద్యాప్రమాణాలు



నందవరం మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): నాలుగేళ్లుగా ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న ప్రణాళికలతో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెరగడమే కాకుండా విద్యాప్రమాణాలు మరింతగా పెరిగాయని రాష్ట్ర విద్యాపరిశోధన సంస్థ డైరెక్టర్ కె రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలం నందవరం మోడల్ స్కూల్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ రకాల ప్రోత్సాహకాలు తయారీ నుంచి విద్యార్థులకు చేరే వరకు ప్రభుత్వం ద్వారా జరుగుతున్న పరిణామ ప్రక్రియను వీడియోల ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పేట శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు

పొదలకూరు : మండలంలోని మరుపూరు గ్రామంలో శ్రీకామాక్షి సమేత మల్లికార్జునస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల దేవస్థానం నిర్మాణం పూర్తి చేసుకుని విగ్రహ ప్రతిష్ఠ జరిగిన సందర్భంగా 46 రోజుల పాటు చేపట్టిన ప్రత్యేక పూజలను నిర్వాహకులు పూర్తి చేశారు. డీఎల్‌డీఓ వసుమతి, ఇతర మండల స్థాయి అధికారులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గ్రామపెద్దలు వేణుంబాక చంద్రశేఖర్ రెడ్డి, వక్లూరు గోపాల్‌రెడ్డి, నలగర్ల పెంచలయ్య, అనిపల్లి బాలకృష్ణారెడ్డి, యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంచనాలు

పొదలకూరు : గ్రామీణ ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలకు అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇటీవల పొదలకూరు సబ్‌స్టేషన్ కార్యాలయం శంకుస్థాపన సందర్భంగా గ్రామాల్లో 24 గంటల త్రీఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేస్తామని ప్రకటించారు. దీనిని అమలు చేసేందుకు విద్యుత్ కన్‌స్ట్రక్షన్ అధికారులు ముందుగా మరుపూరు గ్రామంలో పర్యటించి అంచనాలు రూపొందించారు. అదనంగా 100 కేవీ కలిగిన 10 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు గ్రామంలో పర్యటించారు.

బెలూన్‌పై కార్గిల్ దివస్



బెలూన్‌పై కార్గిల్ వీరుల చిత్రం

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ, సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం మంగళవారం బెలూన్‌పై కార్గిల్ వీర జవానుల చిత్రాన్ని రూపొందించారు. బుధవారం జాతీయ కార్గిల్ విజయ దివస్ సందర్భంగా ఈ చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కళారూపం ద్వారా భారత వీర జవానులకు జేజేలు పలికారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ, ఆర్‌ఎస్‌యూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. స్టోన్‌హౌస్‌పేట సమీపంలోని కేవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బంద్‌ను మంగళవారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజా, ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, నేతలు గణేష్, జశ్వంత్, బాలాజీ, నాగేశ్వరరావు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

కోవూరు: మండలంలోని గంగవరం గ్రామంలో పోలేరమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. భక్తులు ఇంటి వద్ద నుంచి చద్దిని తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శివకుమార్, చిన్నా, నాగేంద్ర పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లు

ఇందుకూరుపేట : మండలంలోని కాలువమూల కండ్రిగ నుంచి గంగపట్నం గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను విజిలెన్స్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను స్థానిక ఎస్సై రాజ్‌కుమార్‌కు అప్పగించారు. దీంతో ట్రాక్టర్లను ఆయన పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ప్రమాదకరంగా మలుపు

- హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని వాహనదారుల విజ్ఞప్తి



ప్రమాదకరంగా ఉన్న మలుపు

పొదలకూరు : పొదలకూరు–కలువాయి మార్గంలో లింగంపల్లితోపునకు సమీపంలో ఉన్న మలుపంటే వాహనదారులకు హడల్. ఆటోలు ఢీ, టిప్పర్ల బోల్తా, మోటారుబైకుల ఢీ, ట్రాక్టర్ల బోల్తా తదితర రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రాణాలను సైతం కోల్పోయారు. ఈ మార్గంలో కొత్తగా వాహనం నడిపే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపు మీదుగా వెళ్లే సమయంలో ఎదురొచ్చే వాహనం సరిగ్గా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడం లేదు. గత పదేళ్లుగా పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం గమనార్హం. నిత్యం రద్దీగా ఉండే మార్గంలో ఇకనైనా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బ్రిడ్జిల్లో నీరు నిల్వ ఉండకూడదు



నెల్లూరు(బారకాసు): వర్షాలతో ప్రజాజీవనానికి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టడంతో పాటు వర్షపు నీరు అండర్ బ్రిడ్జిల్లో నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో డ్రెయిన్లు, లోతట్టు ప్రాంతాలు, మాగుంట లేఅవుట్, విజయమహల్‌గేట్, రామలింగాపురం అండర్ బ్రిడ్జిల వద్ద గల పంపింగ్ స్టేషన్లను అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు తోడేయాలని సూచించారు.

- నగరంలోని 36 / 3 ఫతేఖాన్‌పేట, 37 / 2 రామ్‌నగర్ సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.
- వెంకటేశ్వరపురంలోని జగనన్న లేఅవుట్‌ను హౌసింగ్ విభాగం, ఎస్పీడీసీఎల్, ఇరిగేషన్, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. అదనపు కార్మికులతో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.
- బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు.